

వార్డుల్లోని సమస్యలను పరిష్కరించుకోవాలి

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజా రెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వార్డులలో కౌన్సిలర్లు ప్రత్యేక దృష్టి సాధించి తమ వార్డులలోని సమస్యలను పరిష్కరించుకోవాలని మున్సిపల్ ఛైర్ పర్సన్ మనూజా రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఛైర్‌పర్సన్ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. అంతేకాకుండా రానున్నది వర్షాకాలమైనందున దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, ప్రజలు అనారోగ్య బారిన పడే ప్రమాదముందని చెప్పారు. వార్డులలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. కౌన్సిలర్లు వార్డుల్లోని సమస్యలపై తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం అజెండాలోని అంశాలను చదివి వినిపించడంతో కౌన్సిలర్లు అందరూ ఆమోదించారు . సమావేశంలో వైస్ చైర్మన్ జింక వెంకటాచలపతి, నూర్ ఆజాం, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ క్రమశిక్షణ ముఖ్యం

ప్రజాశక్తి-రాయచోటి

ప్రతి విద్యార్థికీ క్రమశిక్షణ ముఖ్యమని జెఎన్‌టియు కళాశాల మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ పి. నారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాయచోటి శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం ఇండక్షన్(ప్రేరణ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయనతోపాటు విశిష్ట అతిథిగా డైట్ కళాశాల అధ్యాపకులు జనార్దన్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ క్రమశిక్షణ ,అంకితభావంతో తరగతి గదిలోని పాఠాలను ప్రయోగశాలలో నిర్ధారించుకుని తరగతి పాఠ్యాంశాలపై పూర్తి అవగాహనతో అభ్యసించాలని చెప్పారు. అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకొని టెక్నాలజీని ఎప్పటికప్పుడూ పునఃశ్చరణ చేసుకొని సాంకేతికంగా ఎదురయ్యే సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేయాలని సూచించారు . నిజజీవితంలో దగ్గరగా చూసే టెక్నికల్ అంశాలను ఇండక్షన్ కార్యక్రమం ద్వారా సారూప్యత గమనించవచ్చని అభిప్రాయపడ్డారు.



మాట్లాడుతున్న నారాయణరెడ్డి

జనార్దన్ రాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కమ్యూనికేషన్ స్కిల్స్ పై అవగాహన పెంపొందించుకొని, బృంద చర్చలలో పాల్గొని సాఫ్ట్ స్కిల్స్‌ను వృద్ధి చేసుకోవాలని తద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ఎం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ కోర్సులో మొదటి సంవత్సరం నుండే ప్రతి విద్యార్థి ప్రణాళికను సిద్ధం చేసుకుని ఉత్తమ ప్రతిభ కనబరిచి, టెక్నికల్ ప్రదర్శనలో పాల్గొని వివిధ ఆవిష్కరణలను విశ్లేషించి తదుపరి నవీకరణకు శోధన చేయాలని సూచించారు. సాయి ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులు ఎంతోమంది సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, ప్రభుత్వ , ప్రయివేట్ అఖిల భారత సర్వీసులలో అత్యున్నత హోదాలో స్థిరపడ్డారని చెప్పారు. యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి గోల్డ్ మెడల్స్, ప్రతిభ అవార్డులు సాధించారని వివరించారు. ప్రస్తుతం విద్యార్థులకు పారిశ్రామిక అవసరాలను తీర్చే పాఠ్యాంశాలను ప్రవేశపెట్టి ప్రయోగశాలలకు అధిక ప్రాముఖ్యత ఇచ్చిందని చెప్పారు. దీనికి అనుగుణంగా మొదటి సంవత్సరం నుంచి కోడింగ్, ప్రోగ్రామింగ్ విభాగాలు యందు ప్రత్యేక శిక్షణ వనరులు కల్పిస్తున్నామని తెలియజేశారు. ప్రతి సంవత్సరమూ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ ,వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ స్టేడియం పనులు వేగవంతం

- కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ గిరీష పిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణ శివారు ప్రాంతమైన నక్కవాండ్లపల్లి సమీపంలో జరుగుతున్న క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీలోగా క్రికెట్ స్టేడియం అన్ని హంగులతో అత్యంత సుందరంగా పూర్తి చేయాలని పనుల నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. క్రికెట్ స్టేడియం వరకు రోడ్డు, ఆర్చి నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. స్టేడియంలో చూపరులను ఆకట్టుకునేలా మొక్కలు విరివిగా నాటి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. మైదానం చుట్టూ నీడనిచ్చే పెద్ద పెద్ద మొక్కలను నాటలన్నారు. దాదాపు 32 ఎకరాలలో నిర్మించే స్టేడియం నిర్మాణ పనులన్నీ నాణ్యతతో మన్నికగా ఉండేలా చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ గిరీష

నిర్మాణం, స్టేడియం సరిహద్దుల చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం ఏర్పాటు తదితరాలపై రెవెన్యూ, ఆర్అండ్‌బి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రికెట్ స్టేడియంలో కలియతిరిగి పిచ్ నిర్మాణం, అక్కడ నిర్మిస్తున్న గదులను పరిశీలించి శరవేగంగా స్టేడియం పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. స్టేడియం మొత్తం రైన్‌గన్‌తో తడిపి ఎత్తు పల్లాలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఇఇ సహదేవారెడ్డి, డిఇ వెంకటసుబ్బయ్య, తహశీల్దార్ ప్రేమంత్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

స్థలం కేటాయించడం హర్షణీయం

బలిజ సేవా సమితి అధ్యక్షులు బి.పి.ఎల్. విజయకుమార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దశాబ్దాలుగా మదనపల్లె ప్రాంత బలిజలను గత పాలకులు దగా చేస్తే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్ బాషా బలిజల ఆకాంక్షను గుర్తించి నెరవేర్చారని బలిజ సేవ సమితి అధ్యక్షులు బి.పి.ఎల్. విజయకుమార్ పేర్కొన్నారు. గురువారం బలిజ సేవా సమితి కార్యాలయలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మదనపల్లెలో బలిజల కల్యాణ మండపానికి 1ఎకరా 83 సెంట్ల స్థలం కేటాయించడం పట్ల బలిజ సేవా సమితి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెన్నంటి ఉండి నడిపించిన మున్సిపల్ వైస్ చైర్మన్ జింక వెంకట చలపతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా బలిజల సమస్యలను గత పాలకుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించిన ధాఖాలలు లేవని విమర్శించారు. బలిజల ఆరాధ్య దైవమైన విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహం ఏర్పాటు, బలిజల కల్యాణ మండపం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి ద్వారానే సాధ్యమైందన్నారు. మదనపల్లె మండలం బసినికొండ గ్రామ పంచాయతీ సర్వే నంబర్ 174/3 లో 1 ఎకరా 83 సెంట్ల భూమిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసినట్లు వెల్లడించారు. నాలుగు నెలల కిందట మదనపల్లె పట్టణ నడిబొడ్డున అప్పటి మల్లికార్జున సర్కిల్‌లో శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణకు విచ్చేసిన రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్ బాషా,



సమావేశంలో మాట్లాడుతున్న బి.పి.ఎల్. విజయకుమార్

కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషుకు బలిజ సేవ సమితి అధ్యక్షులు బిపిఎల్ విజయ్ కుమార్ నేతృత్వంలో బలిజ సంఘం నాయకులు కళ్యాణ మంటపానికి అవసరమైన స్థలం కేటాయించాలని విన్నవించామని చెప్పారు. అప్పటికప్పుడూ మంత్రి, ఎంపి జిల్లా కలెక్టర్, కాపు కార్పొరేషన్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వెంటానే స్థలాన్వేషణ చేసి అన్ని అనుమతులు ఇచ్చి బుధవారం స్థలాన్ని కేటాయిస్తూ జీవో విడుదల చేశారు. మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని బలిజ కులస్తులు మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్ బాషకు రుణపడి ఉంటారని అన్నారు. సమావేశంలో బలిజ సేవా సమితి అధ్యక్షుడు బిపిఎల్ విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి భాస్కర్, ట్రెజరర్ మదనేశ్వర్, భానుప్రకాష్, ఉపాధ్యక్షులు స్టోర్ మోహన్, పగడాల నూరి, సంయుక్త కార్యదర్శి జంగాల శివరామ్ రాయల్, శ్రీనివాసులు, రాజ్ భవన్ రాజ, పూల నాగరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పునాదులు తొలగించొద్దని ఆందోళన



బేస్‌మట్టం కూల్చివేతను అడ్డుకుంటున్న ఆందోళన కారులు

ప్రజాశక్తి - లక్కిరెడ్డిపల్లి

తమకు ఇచ్చిన స్థలాల్లో పునాదులు నిర్మించుకున్నామని, అధికారులు తొలగించొద్దని పట్టాదారులు గురువారం ఆందోళన చేపట్టారు. మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లిలోని గురుకుల పాఠశాల సమీపంలో సర్వేనెంబర్ 549లో గతంలో 1991వ సంవత్సరంలో అప్పటిలో కొంతమంది ఎస్సీ ఎస్టీలకు అధికారులు ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. ఇప్పటి వరకూ వారు ఇళ్లు నిర్మించుకోకపోవడంతో ప్రస్తుతం వాటిని రద్దుచేసి ఎస్సీలకు ఇంటి పట్టాలు ఇచ్చారు. ఈనేపథ్యంలో తహశీల్దార్ ఉదయ్‌శంకర్, డిప్యూటీ తహశీల్దార్ రెడ్డన్న పోలీసులతో కలిసి గతంలో నిర్మించిన బేస్‌మటాలను జెసిబితో తొలగిస్తుండగా ఈ విషయం తెలుసుకున్న పాత పట్టాదారులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. గతంలో తమకు ఇచ్చిన పట్టా భూమిలో బేస్ మటాలు ఏర్పాటు చేసుకున్నామని, ఇప్పుడు తొలగిస్తే ఎలా అని ప్రశ్నించారు. రెవెన్యూ అధి కారులు జోక్యం చేసుకొని పాత పట్టాదారులు ఇళ్లు నిర్మించుకోకపోవడంతో అప్పటి తహశీల్దార్ 2017లో వాటిని రద్దు చేశా రని చెప్పారు. ప్రభుత్వ భూమి ఖాళీగా ఉండడంతో ఉత్తరమేటి హరిజ నవాడ పల్లెకు చెందిన 11 మంది ఎస్‌సి లకు, మొత్తం 32 మందికి 2020లో లేఅవుట్లు పట్టాలు ఇచ్చామనిచెప్పారు. గతంలో బోధ కొట్టాలు వేసుకొని ఇంటి పన్ను కట్టా మని బాధితులు ఉదయ శంకర్ రాజుకు వివ రించారు. కొద్దిసేపు అధికారులకు, ఆందోళన కారు లకు వాగ్వివాదం చోటు చేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకొని పూర్తిస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తామని, ఈ స్థలంలోకి ఎవరూ రాకూడదని చెప్పడంతో ఆందోళన కారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

గజదొంగల రాజ్యం నడుస్తోంది

మోడీ, జగన్ ప్రభుత్వాలను సాగనంపాలి
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గజదొంగల రాజ్యం నడుస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో చేపట్టిన బస్సు యాత్ర గురువారం జమ్మలమడుగుకు చేరింది. ముందుగా ఎద్దుల ఈశ్వర రెడ్డి విగ్రహంకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించాలని, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని, కడపలో ఉక్కు పరిశ్రమను నిర్మించాలనే ఉద్దేశంతో బస్సు యాత్రను ప్రారంభి ంచామన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి విచ్చలవిడిగా వైన్స్, ఇసుకను అమ్ముతూ డబ్బులు దండుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే రాష్ట్రంలో దొంగల ముఠా రాజ్యమేలుతుందని వాపోయారు. కడప ఉక్కు పరిశ్రమకు నాలుగు సార్లు శంకుస్థాపన చేశారని, కనీసం నాలుగు అడుగులు కూడా పడలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఇసుకను అమ్ము కుంటున్నారని పేపర్లలో చదివానని తెలిపారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ఎస్సి, ఎస్టీలకు ఇచ్చిన భూములను లాక్కోవడం సిగ్గు చేటన్నారు. అనంతరం పిసిసి మీడియా చైర్మన్ తులసి రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ 9 సంవత్సరాలలో 109 లక్షల కోట్లు అప్పు చేశారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి ప్రయివట్ వ్యక్తులకు తాకట్టు పెడుతుందని వివరించారు. 13 మంది ప్రధాన మంత్రులు కలిసి 67 సంవత్సరాలలో రూ. 46 లక్షల కోట్లు అప్పు చేస్తే, ఈయన మాత్రం తొమ్మిది ఏళ్లలోనే 109 లక్షల కోట్లు అప్పు చేసి దేశాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చా రన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం ఫీజుబిలిటీ



బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

లేదనడం సరి కాదన్నారు. నేడు రాష్ట్రంలోని బిజెపి ఉక్కు పరిశ్రమ నిర్మిస్తామని చెప్పడం, అంతలోనే కేంద్ర ప్రభుత్వం కడప ఉక్కు పరిశ్రమ నిర్మించడం సాధ్యం కాదని పార్లమెంట్‌లో ప్రకటించడం చూ స్తుంటే రెండు నాలుకల ధోరణిని గా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్ర, కడప జిల్లా ప్రజలకు ఊరి స్తోందని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మభ్య పెట్టకుండా, కడప ఉక్కు పరిశ్రమ నిర్మించాలని లేకుంటే రాష్ట్రంలో రెండు పార్టీలకు పుట్టగతులు ఉండవని హె చ్చరించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, సిపిఐ జాతీయ, రాష్ట్ర నాయకులు ఓబులేసు, ఈశ్వరయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ప్రసంగించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి, ప్రసాద్, సిపిఎం నాయకులు వీరణాల శివ నారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి మనోహర్, విజయ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కంటి చూపు ప్రధానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థులకు కంటి చూపు సక్రమంగా ఉన్నప్పుడే వారు ఏదైనా సాధించడానికి వీలు అవుతుందని లయన్స్‌క్లబ్ అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి పేర్కొన్నారు. గురువారం మదనపల్లి సిల్క్‌టౌన్ నీరుగట్టువారిపల్లెలోని సాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో కరస్పాండెంట్ మోడెం శ్రీనివాసరావు సహకారంతో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 6 నుండి 10వ తరగతి చదివే 300 మందికిపైగా విద్యార్థులకు పరీక్షలు చేశారు. ఇందులో దృష్టి సమస్యలున్న వారికి కంటి అద్దాలకు ఎంపిక చేశారు. స్థానిక జ్ఞానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సుమారు 600 మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేస్తామని లయన్ అప్పినపల్లి భాస్కరాచారి తెలిపారు. ,విద్యార్థులలో కంటి చూపు మందగించడం, తగిన సమయంలో సరైన జాగ్రత్తలు పాటించక పోవడం వంటి సమస్యలపై లయన్స్ క్లబ్ దృష్టి సారించిందన్నారు. బెంగుళూరుకు చెందిన 8 మంది డాక్టర్లు బృందం వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. చిన్నారుల కంటి చూపు మెరుగు పరచడానికి లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందు ఉంటుదని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పిఆర్ఓ గౌతమ్ రెడ్డి, మహేష్, సాయి విద్యాని కేతన్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ హెచ్ఎం.రెడ్డెప్ప, హసీనా, సుగుణ, పుష్ప ,శ్రీదేవి, ప్రవల్లిక, బిలాల్ పాల్గొన్నారు.

డాక్టర్ యోగేష్ బాబుకు ఎక్సలెన్స్ పురస్కారం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరుకు చెందిన డాక్టర్ తుంగా యోగేష్ బాబుకు ఎక్సలెన్స్ పురస్కారం లభించింది. గురువారం పీలేరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగంలో అకడమిక్ లీడర్షిప్, టీచింగ్, రీసెర్చ్ కాంట్రిబ్యూషన్, జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ రీసెర్చ్ అసోసియేట్‌గా వివిధ రంగాల్లో చేసిన విశేష కృష పురస్కారం ప్రదానం చేశారన్నారు. భారతదేశ యుడోక్సియా రీసెర్చ్ సెంటర్, యుఎస్‌ఏ యుడోక్సియా రీసెర్చ్ యూనివర్సిటీ సయుక్తంగా అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిష్టాత్మకమైన రాయల్ గోల్డెన్ ఫెలో, రాయల్ గోల్డెన్ అవార్డుల కాను ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ రీసెర్చ్ కౌన్సిల్ ఆఫ్ యూడోక్సియా రీసెర్చ్ సెంటర్, యుడోక్సియా, రాయల్ గోల్డెన్ ఫెలో, రాయల్ గోల్డెన్ అవార్డు, “జి. సుబ్రమణ్య అయ్యర్ ఎక్సలెన్స్ అవార్డు’ను ప్రదానం చేశారు.



అవార్డు అందుకుంటున్న యోగేష్‌బాబు

న్యూక్లియర్ పవర్ సైంటిఫిక్ ఆఫీసర్‌గా లిఖిత్ రెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి రెడ్డీస్ కాలనీకి చెందిన ఇంజినీర్ సుదర్శన్ రెడ్డి కుమారుడు లిఖిత్ రెడ్డి న్యూక్లియర్ పవర్ సైంటిఫిక్ ఆఫీసర్‌గా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎస్వీ యూనివర్సిటీ తిరుపతిలో బిటెక్ చదివి గోల్డ్‌మెడల్స్ సాధించారు. ముంబైలో ఎంటెక్ చదివి ఐఐటి టాపర్గా నిలిచారు. తన విజయం వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం, సహకారం ఎంతో ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంజనీర్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ తమ కుమారుడు కష్టానికి తగ్గ ఫలితంగా మంచి ఉద్యోగం రావడం సంతోషంగా ఉందన్నారు.



ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టినందుకే దాడి : శ్రీనివాసులురెడ్డి

కడప అర్బన్ : జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేస్తున్న ఇసుక అక్రమ రవాణా గురించి ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టానని తనను కిడ్నాప్ చేసి దాడి చేశారని వైసిపి కార్యకర్త శ్రీనివాసులు రెడ్డి ఆరో పించారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనపాటు, నాయకుడు గంగవరం శేఖర్ రెడ్డిని కూడా చంపు తామని ఫోన్‌లో బెదిరించారన్నారు. కిడ్నాప్ లో ఎమ్మెల్యే పాత్ర ఉందని తెలిపారు. కిడ్నాప్ విషయంపై ఎర్రగుంట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని చెప్పారు. తనను ఎర్రగుంట్ల రోడ్డులోని అయ్యప్ప గుడి నుంచి బలవంతంగా కార్లలో ఎత్తుకెళ్లారని తెలిపారు. దారి వెంట కొట్టుకుంటూ, తిడుతూ ఆర్‌టిపిపి రోడ్డులో రైల్వే గేట్ వరకు తీసుకెళ్లారన్నారని చెప్పారు. అనంతరం గంగవరం శేఖర్ రెడ్డి మాట్లా డుతూ మీడియా చురుగ్గా పనిచేయడం వల్లే మాలెపాడు శ్రీనివా సులరెడ్డి కిడ్నాప్‌కు కారణం అయిందన్నారు. 2019లో పార్టీ కోసం ఎన్నికల్లో వైసిపి కోసం పని చేశారని తెలిపారు. శ్రీని వాసులు రెడ్డి భార్య మెడలో బంగారు నగలు అమ్మి పార్టీ కోసం సేవ చేశాడని చెప్పారు. ఇలాంటి కార్యకర్తలు జమ్మల మడుగు నియోజక ర్గంలో చాలా మంది ఉన్నారని తెలిపారు. అలాంటి వారిని పై కిడ్నాప్ చేసి, కొట్టడం దారుణమని చెప్పారు. ఇక సర్పంచ్ రాముడిని కూడా రెండు గంటల పాటు ఇంట్లో ఎమ్మెల్యే నిర్బంధించి బెదిరింపులకు గురిచేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే బెదిరింపులకు భయపడే వారులేరన్నారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గెలుపు కోసం పనిచేశానని, తనకు అన్యా యం జరిగిందని ప్రశ్నిస్తే వైసిపి వ్యక్తిని కాదంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కిడ్నాప్ పై పోలీసులు చర్య తీసుకోవాలని, ఇలాంటి చర్యలు భవిష్యత్తులో జరగకూడదని తెలిపారు.



పూర్వ విద్యార్థిని సన్మానిస్తున్న సిబ్బంది

వెబ్ డెవలప్‌మెంట్‌పై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం వారు వెబ్‌డెవలప్‌మెంట్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మిట్స్ కళాశాల పూర్వ విద్యార్థి ఏం. పురుషోత్తం రెడ్డి, ఫ్రంట్ ఎండ్ డెవలపర్, ఒరాకిల్, బెంగళూరు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెబ్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని అన్నారు. వెబ్ డిజైనింగ్ అనేది వెబ్ ద్వారా వినియోగదారులకు అందించే ఒక వెబ్ పేజీ అని, వెబ్‌సైట్ లేఅవుట్‌ను సృష్టించడం, కంటెంట్, చిత్రాలను జోడించడం ఇందులో ముఖ్యమైనవని అన్నారు. వెబ్‌సైట్ డిజైన్‌లో క్లయింట్ అవసరాల విశ్లేషణ, వినియోగం, కాన్సెప్ట్ క్రియేషన్, లేఅవుట్ డిజైనింగ్ మొదలైనవి వెబ్ బ్రోవసేర్ ద్వారా ఓపెన్ చేయబడతాయని ఆయన అన్నారు. ఇంటర్వ్యూలకు ప్రతి ఒక్కరూ తమ స్కిల్స్‌ను పెంపొందించుకుని హాజరవ్వాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కల్పన, కో-ఆర్డినేటర్ షాయిజ్, అలుమ్ని కో -ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

వేతనాల చెల్లింపునకు త్వరితగతిన చర్యలు : యుటిఎఫ్

కడప అర్బన్ : ఇటీవల బదిలీలు, ఉద్యోగోన్నతులు పిజిటిలుగా వెళ్ళిన స్కూల్ అసిస్టెంట్లకు 3 నెలలుగా జీతాలు చెల్లించడంలో నెలకొన్న సమస్యను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, జిల్లా ఉపఖజాన అధికారి ఎం.ఎస్. వెంకటేశ్వర్లును కోరా రు. గురువారం జిల్లా ఉపఖజాన శాఖ కార్యాలయంలో డిటిఎ ఎంఎస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పాళెం మహేష్ బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబ ంధించిన క్యాడర్ స్ట్రెంత్, పొజిషన్ ఐడిలు విద్యాశాఖ నుంచి సిఎఫ్ఎంఎస్ కు రాష్ట్ర ఖజానా శాఖకు వెళ్లాయని అక్కడి నుంచి జిల్లాలకు కూడా పంపారని తెలిపారు.

ఎపి ఎన్ఆర్‌టి సేవలు అభినందనీయం

కడప : ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైట ప్రవాసాంధ్రులకు అందిస్తున్న సేవలు అభినందనీయం అని మహ్మద్ నవాజ్ బాషా పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన షేక్ మహబూబ్ జాన్ అనే మహిళ ఆరు నెలల కిందట కువైట్‌కు వెళ్లారు. అక్కడ ఆమె పనిచేసే ఇంట్లో కష్టాలు పడుతుండదని ఎపిఎన్ఆర్ఎస్ దృష్టికి దీసుకెళ్లి ఎలాగైనా స్వస్థలానికి తనను పంపించాలని కోరారు. నవాజ్ వెంటనే స్పందించి డైరెక్టర్ బి. హెచ్. ఇలియాస్ ద్వారా చైర్మన్ మేడ పాటి వెంకట్ దృష్టికి తీసుకెళ్లారు. మేడపాటి వెంకట్ కువైట్ ఇండియన్ ఎంబసీ అధికారులకు మెయిల్ ద్వారా సమాచారం అందించి వైసి కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డికి విషయాన్ని వివరించి మహబూబ్ జాన్ ను ఇండియా పంపే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పైగా ఆమెకు మానవతా దృక్పథంతో ఫ్లైట్‌కు డబ్బులు ఇచ్చి స్వదేశానికి రప్పించారు. మహబూబ్ జాన్ మాట్లాడుతూ ఎపిఎన్ఆర్‌టిఎస్ సహకారంతో స్వగృహానికి బయలుదేరానని అందుకు సహకరించిన వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

కొత్త ఓటర్ల నమోదు పూర్తి చేయాలి

వల్లూరు : ఇంటింటికి తిరిగి కొత్త ఓటర్లు నమోదు పూర్తి చేయాలని కడప కలెక్టర్ విజయరామరాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వల్లూరులో బిఎల్వోలు చేపట్టిన ఓటర్ నమోదు పరిశీలించి 7,8 ఫారాలు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ లిస్ట్‌లో ఒక వ్యక్తి పేరు రెండో పోలింగ్ స్టేషన్లో ఉంటే వారి ఇంటికి వెళ్లి ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటు ఉండేలా చూడాలన్నారు. కొత్త ఓటర్లు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారని తహశీల్దార్ శంకరరావును అడిగి తెలుసుకున్నారు. ఓటర్ కార్డులో మార్పులు చేర్పులు ఉంటే వెంటనే పరిశీలించి పూర్తి చేయాలన్నారు. అక్టోబర్ నెలలోగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి , డిటి సుహాసిని ,రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

దేశ రక్షణలో ప్రధాని మోడీ విఫలం

కడప : దేశ సార్వభౌమాధికార రక్షణలో ప్రధాని మోడీ పూర్తిగా విఫలం చెందారని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ అలీఖాన్ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర రక్షణలో కూడా ప్రధాని నరేంద్ర మోడీ పిరికితనం ప్రదర్శి స్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ దాని మూక సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లకు ప్రజలు బుద్ధి చెబుతారని విమ ర్శించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా బిసి సెల్ చైర్మన్ చిన్న కొల్లాయప్ప పాల్గొన్నారు.



ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

శాస్త్ర సాంకేతిక రంగంలో ఆదర్శంగా నిలిచాం

ప్రజాశక్తి-రామాపురం

చంద్రయాన్-3 విజయవంతంతో శాస్త్ర సాంకేతిక రంగంలో మన దేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని ఎంఇఒ రామకృష్ణుడు పేర్కొన్నారు. మండలంలోని నీలకంఠారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం చంద్రయాన్-3 విజయవంతంపై విద్యార్థులతో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ భారతదేశం ప్రపంచంలో ఏ దేశానికి తీసిపోని విధంగా శాస్త్ర సాంకేతిక రంగంలో దూసుకుపోతుందని అన్నారు. చంద్రుని దక్షిణ ధ్రువం పై ఇంతవరకు ప్రపంచంలో ఏ దేశం చేయని ప్రయోగాన్ని మన దేశం చేసి చూపించదన్నారు. కార్యక్రమంలో తెలుగు, ఉర్దూ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, హిలాల్అహ్మద్, పీడీ నరేంద్రకుమార్‌రెడ్డి, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు శిల్పారామానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని బండపల్లి పంచాయతీ జాతీయ రహదారి సమీపంలో రాయచోటి రింగ్ రోడ్ దగ్గర ఏర్పాటు చేస్తున్న శిల్పారామానికి శుక్రవారం కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలు భూమిపూజ చేయనున్నట్లు జెసిఆర్ కన్స్ట్రక్షన్ యాజమాని పెంచలరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతి నిధులు, అధి కారులు హాజరుకావాలని కోరారు.

జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తా

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లటూరు శ్రీనివాసరాజు

జనసేన సిద్ధాంతాలు, అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజలలోకి తీసుకెళ్తానని రాష్ట్ర డిఆర్‌డిఎమ్‌జి ఉద్యోగి ఎల్లటూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. గురువారం పట్టణ శివారులోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పవన్ కల్యాణ్ ఆశయాలు, భావాలు తనను చాలా ఆకర్షించాయని అన్నారు. పవన్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ నియోజకవర్గంలో జనసేన బలోపేతానికి జనసైనికులతో పనిచేస్తానన్నారు. త్వరలో జనసేన పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ రెండవ తేదీ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకొని స్థానిక జనసేన కార్యాలయం వద్ద మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తదాన మహోత్తర ప్రాణాన్ని నిలుపుతుందని, ఈ రక్తదాన శిబిరానికి జనసైనిక అభిమానులు, జనసైని కులు, కార్యకర్తలు, మెగా అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రక్తదాన శిబిరంతోపాటు భారీ అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేయ నున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లటూరు శివరామరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీకి ఇసుక అనుమతులు

సుండుపల్లి: మండలంలోని జగనన్న కాలనీలో ఇళ్ళ నిర్మించుకునే లబ్దిదారులకు మట్టి, ఇసుకకు అను మతులు మంజూరు చేసినట్లు తహశీల్దార్ మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. జగనన్న కాలనీలో ఇంటి నిర్మా ణాలు వేగవంతం చేసేందుకు ఇసుక కొరత లేకుండా ఎపి హౌసింగ్ అధికారులు అవసరమున్న చోట సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ద్వారా స్లిప్పులను అందించాలని ఆదేశించారు. ఇంటి నిర్మాణాలు చేపట్టే జగనన్న కాలనీలో విఆర్‌ఒలు ద్వారా మట్టి తోలుకునేందుకు అనుమతిస్తామని ఇబ్బంది లేకుండా మట్టిని తోలుకోవచ్చని సూచించారు. వీలైనంత త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు.

ఏజెన్సీ నలందలో రాఖీపౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రీజెన్సీ నలంద పాఠశాలలో గురువారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి రాఖీ పండుగ గొప్పతనాన్ని తెలుపుతూ రాఖీలు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విద్యార్థులకు విషయ అవగాహన కలిగేలా మన సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలిసేలా చేయడం కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు విద్యాసంస్థల సిఎఒ జి.విజయ చంద్ర తెలిపారు. రాఖీ అంటే కేవలం చేతికి కట్టుకునే దారం కాదని, అది ఒక ఆత్మీయ బంధం బాధ్యత అని చిన్నారులకు తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పాఠశాల ప్రిన్సిపల్ డి.మురళి మోహన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఈ ప్రైమరీ ఇన్‌ఛార్జి జయశ్రీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు నాయనబావిలో పల్లెబాట

బి.కొత్తకోట: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పల్లెబాట కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శంకరయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం మండలంలోని పట్రవారిపల్లి, గుట్టపాలెం, కంబాలపల్లి, గజ్జలవారిపల్లి, కాయలవారిపల్లి అంజనేయపురం పంచాయతీలో పల్లెబాట కార్యక్రమం జరుగుతుందన్నారు.ఉదయం 7 గంటలకు పట్రవారిపల్లి నుంచి ప్రారంభమై పల్లె మీదుగా గుట్టపాలెం, ఆంజనేయపురం, కంబాలపల్లి, గజ్జలవారిపల్లి, కాయలవారిపల్లి పల్లెబాట కార్యక్రమం సాగుతుంద్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్లెబాట కార్యక్రమాన్ని మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు గృహ సారథులు, సచివాలయం కన్వీనర్, వాలంటీర్లు, ప్రజలు కావాలని కోరారు.

ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన

కలకడ : మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ జగనన్న కాలనీలో లబ్ది దారులకు ఒఎస్‌డి రామచంద్రారెడ్డి, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ కిషోర్‌కుమార్‌లు ఇంకుడు గుంతలు ఎలా నిర్మించుకోవాలనే అంశం పై అవగాహన కల్పించారు. ప్రభుత్వం వీటికోసం రూ.6 వేలు ఇళ్లు పూర్తిగా నిర్మించుకున్న వారికి అవకాశం కల్పించిందని ప్రతి ఒక్క లబ్ది దారుడు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవిరవికుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటదాస్, హౌసింగ్ ఎఇ రమణయ్య, వర్క్ ఇన్స్‌పెక్టర్ నాగమునినాయక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చరిష్మాంజలి, బయన్న, చంద్రయ్య పాల్గొన్నారు.

ఎరుకుల హక్కుల కోసం ఐక్యం కావాలి

తంబళ్లపల్లి : ఎరుకల హక్కులు సాధించుకునేందుకు ఐక్యంగా పోరాడాలని ఆల్ ఇండియా హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షులు రఘుపతి కోరారు. గురువారం పరస్తోపు కాలనీలో సంఘం పథకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘుపతి మాట్లాడుతూ ఎరుకలు సామాజికంగా ఆర్థికంగా రాజకీయపరంగా వెనుకబడి తమ హక్కులను పొందలేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరుకలు అందరూ ఐక్యంగా తమ హక్కులను సాధించుకునేందుకు పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పెద్దవెంకటరమణ, వీరాంజ నేయులు, రెడ్డప్ప, వెంకటరమణ, మంజుల, కుమార్,జయరాం మల్లమ్మ, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎరుకుల హక్కుల పోరాట సమితి నాయకులు

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట : 'గడికోట'

ప్రజాశక్తి-రామాపురం



ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట రాష్ట్రంలో సువర్ణ పాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలం నల్లగుట్టపల్లె గ్రామ పంచాయతీలో బిసి కాలనీ, నల్లగుట్టపల్లె కస్పా, కొత్తపల్లె లలో పర్యటించారు. గడప గడప కు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలును వివరిస్తూ, ప్రజా సమస్యలను ఆరా తీశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్రలా నిలిచిపోయారని అన్నారు. మరో మారు ముఖ్యమంత్రి చేసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రజాధరణలో తండ్రికి మించిన తనయుడిగా జగన్మోహన్‌రెడ్డి పేరు ప్రఖ్యాతలు సంపాదించు కున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గడికోట జనార్ధన్‌రెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీచైర్మన్ కర్ణపు విశ్వనాధ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, వైస్ ఎంపిపి రవిశంకర్‌రెడ్డి, హస్త కళల డైరెక్టర్ హుస్సేన్ ఎంపిడిఒ హైదర్‌వలీ, తహశీల్దార్ అరవింద్‌కిషోర్, మండల స్థాయి అధికారులు సర్పంచ్ నాగభూషన్‌రెడ్డి, యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరం వెంకటసుబ్బారెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, స్థానిక నాయకులు చెన్నారెడ్డి, శ్రీధర్ రెడ్డి,భక్త వత్సల రెడ్డి, సత్యాయాదవ్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

ఓటు తొలగింపులో జాగ్రత్తలు వహించండి : జెసి



ఓటర్ సర్వే రికార్డులను పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి-కలికిరి

ఓటర్ జాబితాలో పేర్లను తొలగించేటప్పుడు జాగ్రత్త వహించాలని జెసి ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ రెవెన్యూ అధికారులకు సూచించారు. గురువారం ఆయన తహసిల్దార్ కార్యాలయంలో ఓటర్ సర్వే రికార్డులను పరిశీలించారు. అనంతరం గుట్టపాలెం పంచాయతీలో పలు గ్రామాలను సందర్శించి ఓటు తొలగింపులో ఎలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని, ఫామ్7ను జత చేసి తొలగింపుకు కారణాలు ధ్రువపరచాలని తెలిపారు. తొలగింపుకు కారణలైన వివాహం, మరణ ధ్రువపత్రాలను జతపరచాలని, బ్రతుకుతెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటరు జాబితా నుండి తొలగించకూడదని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ భాగ్యలత, విఆర్‌ఒలు కదిరప్ప, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

దళితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



కలకడ : అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి శ్రీదేవిరవికుమార్

ప్రజాశక్తి-కలికిరి

దళితుల సమస్యల పట్ల అధికారులు ఎప్పటికప్పుడు స్పందించాలని తహశీల్దార్ భాగ్యలత సూచించారు. పౌర హక్కుల దినోత్సవంసందర్భంగా గురువారం కలికిరి బండకాడపల్లి, కోర్లకుంటలో తిమ్మారెడ్డి మాదిగపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ సమావేశంలో దళితులు నుండి వచ్చిన సమస్యలపై తహశీల్దార్ భాగ్యలత స్పందించారు. దళితుల సమస్యలపై ప్రత్యేక చొరవ తీసుకుంటామని హామీని ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో వీధిలైట్లు వెలగలేదని, డ్రైయినేజీ కాలువలు శుభ్రం చేయలేదని, రేషన్ బియ్యం పంపిణీ చేసే ఎండియు ఆపరేటర్లు వీధిలోకి రావడం లేదని పలు సమస్యలను అధికారులకు దృష్టికి తీసుకవచ్చారు కార్యక్రమంలో ఎఎస్‌ఐ మధుసూదనాచారి, డిటి సయ్యద్, యుఒఆర్‌డి ఆజాద్, డాక్టర్ చిన్నరెడ్డప్ప, విఆర్‌ఒలు విశ్వనాథ్, నరేష్, విఆర్‌ఎ బాబు, ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ సభ్యులు గడ్డం యేసురాజు, శ్రీనివాస్ వర్మ, శంకరగిరి పాల్గొన్నారు. **కలకడ:** చట్టం ముందు అందరూ సమానులేనని చట్టం ఎవరికి చుట్టం కాదని ఎంపిపి శ్రీదేవిరవికుమార్ సూచించారు. పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా యర్రయ్యగారిపల్లి పంచాయతీ బాలయ్యగారిపల్లి దళితవాడలో పౌరహక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. దళిత ఉండే సమస్యలను ప్రజల ద్వారా తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల ఇంటి వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నారని, అందరూ వారి పిల్లలని బాగా చదివించాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ అన్నారు. తహసిల్దార్ ప్రదీప్ మాట్లాడుతూ ప్రజలు ఇళ్లు, శ్మశాన వాటిక కావా లని కోరారని, ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో పరిశీలించి ప్రజ లకు ప్రభుత్వ భూమి ఉంటే ఇల్లు కట్టుకోవడానికి స్థలం ఇస్తామని, శ్మశాన వాటికకు స్థలం కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు మునీంద్ర నాయక్, రామచంద్రారెడ్డి, విఆర్ఒ, విఆర్‌ఎ, హెడ్‌కానిస్టేబుల్ పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ సమావేశం

నిమ్మనపల్లె : మండలంలో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ సిఆర్.మంజుల ఆధ్వర్యంలో ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ సమావేశాన్ని గురువారం తూతూ మంత్రంగా నిర్వహించారని దళిత సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి ఎంపిపి నరసింహులు, మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్‌ఐ రమణ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ దళితుల సమస్యలను పరిష్కరించి, వారి అభివృద్ధిని ఆకాంక్షించడానికి ప్రతి మూడు నెలలకు ఒక్కసారి ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ సమావేశాన్ని మండల మెజిస్ట్రేట్, తహశీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించాల్సి ఉందన్నారు. కానీ అందుకు భిన్నంగా తొమ్మిది నెలలు గడిచిన తరువాత సమావేశాన్ని నిర్వహించారని అన్నారు. మండల మాలమహానాడు అధ్యక్షులు, మాల మహానాడు జాయింట్ సెక్రెటరీ వీరనాల మాణిక్యం, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు రెడ్డి నారాయణ లకు, పాత్రికేయ మిత్రులకు తహశీల్దార్ కార్యాలయం నుంచి ఎస్సీ, ఎస్టీ సమావేశం పై కనీస సమాచారం అందించకుండా నిర్వహించడంపై దళిత సంఘ నాయకులు ధ్వజమెత్తారు. గత కొన్ని ఏళ్లుగా దళిత వాడల్లో శ్మశాన వాటికలను మురుగునీటి కాలువలు, సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని వేడుకుంటున్న తహశీల్దార్ పట్టించుకోవడం లేదని, ఇదే విషయాన్ని గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా దృష్టికి తీసుకువెళ్లినా ఎమ్మెల్యే తిరిగి తహశీల్దార్‌ను శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని, దళితవాడల్లోని సమస్యలను పరిష్కరించాలని ఆదేశించిన ప్రయోజనం కనిపించలేదని తహశీల్దార్‌ను ప్రశ్నించారు కార్యక్రమంలో దళిత నాయకులు వీరనాల మాణిక్యం, సహదేవ, ఎర్రయ్య, రాజన్న, మునిరత్న, సుధాకర, రెడ్డినారాయణ, చెంద్రాయుడు, గంగులప్ప, రమణ పాల్గొన్నారు.



నిమ్మనపల్లి : దళితుల సమస్యలపై మాట్లాడుతున్న వీరనాల మాణిక్యం

మెరుగైన పారిశుధ్యానికి చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్థానిక నగర పంచాయతీలో మెరుగైన పారిశుధ్యానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమీషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొన్నారు. గురువారం ఆయన మేనేజర్ రమాదేవి, శానిటేషన్ ఇన్స్పెక్టర్ కిరణ్‌కుమార్ ఇతర సిబ్బందితో కలిసి పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు అన్ని వార్డులలో పారిశుధ్య కార్మికుల చేత శుభ్రం చేయించాలన్నారు. మెరుగైన పారిశుధ్యం ఉన్నప్పుడే పట్టణ ప్రజలను అంటువ్యాధుల బారి నుంచి రక్షించవచ్చునన్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా వార్డులలో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు.అటు పారిశుధ్యకార్మికులు, నగర పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేసి నగర పంచాయతీని స్వచ్ఛ సర్వేక్షన్ జాబితాలో అగ్రగామిగా నిలపాలని పిలుపునిచ్చారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కిరణ్‌కుమార్



గాలివీడు : సంఘీభావ పాదయాత్రలో రమేష్‌రెడ్డి, సుగవాసి ప్రసాదబాబు

జగన్ దుష్టపాలనకు రోజులు దగ్గర పడ్డాయి

ప్రజాశక్తిగాలివీడు

సిఎం జగన్ దుష్ట పాలనకు రోజులు దగ్గర పడ్డాయని ఎక్కడ చూసిన అవినీతి, అక్రమాలు రాజ్యమేలుతున్నాయని ఇసుక దందాలు, భూ కబ్జాలలో వైసిపి నాయకులు మునిగి తెలుతున్నారని మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్ కుమార్‌రెడ్డి గారు ధ్వజమెత్తారు. గురువారం టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర 200 రోజు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన సంఘీభావ పాదయాత్రలో రమేష్‌కుమార్‌రెడ్డి, ప్రసాదబాబులు పాల్గొన్నారు. మండల కేంద్ర సమీపంలోని గాలివీటి గంగమ్మ ఆలయం నుండి గేటు వరకు వేలాది మంది ప్రజలు,టీడీపీ నాయకులు ,అభిమానులు,కార్యకర్తల తో పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తోందని ప్రశ్నించారు. పాదయాత్రలో లక్కిరెడ్డిపల్లె, రామాపురం, సంబేపల్లె, చిన్నమండెం, రాయచోటి మండలాల నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **నందలూరు :** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఐదు కోట్ల ఆంధ్రులలో నూతన ఉత్తేజం నింపిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చంగల్ రాయుడు అన్నారు. యువగళం 200 రోజులు పూర్తయిన సందర్భంగా నాగిరెడ్డిపల్లె గ్రామంలోని మారెమ్మ ఆలయం నుండి శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయం వరకు పెద్ద ఎత్తున టిడిపి శ్రేణుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తుకు గ్యారెంటీ ద్వార సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబు తోనే సాధ్యమని అన్నారు. మహిళల కోసం మహాశక్తి, తల్లికి వందనం, దీపం, ఉచిత బస్సు ప్రయాణం అందించడం జరుగుతుందని అన్నారు. అన్నదాత పథకం, బీసీలకు రక్షణ చట్టం, ఇంటింటికి మంచినీరు, ఐదేళ్లలో పేదల ఆదాయం రెట్టింపు, నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు టిడిపి పార్టీతోనే సాధ్యమని అన్నారు.

సంచార జాతులను ఆదుకోవాలి

లక్కిరెడ్డిపల్లి : సంచార జాతులను ఆదుకోవాలని జిల్లా సంచార జాతుల ప్రధాన రాయదుర్గం కార్యదర్శి హరికృష్ణ పేర్కొన్నారు. గురువారం సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు భారతావని బ్రిటిష్ వారి కబంధహస్తాలలో చిక్కుకొని విలవిలలాడుతున్న తరుణంలో సంచార కులాలు ఏకమై స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారన్నారు.సంచార జాతుల వారు నిజమైన, దేశభక్తి, ధైర్యం, తెగింపు గలవారు అని తెలుసుకొని వీరిని అణగ ద్రొక్కకపోతే తమకు మనుగడ ఉండదని గ్రహించి సుమారు 200 సంచార కులాలను క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్ 1871 చట్టం క్రింద తీవ్ర నేరస్తులుగా ప్రకటించారు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటికీ క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్ చట్టం నుండి భారత ప్రభుత్వం సంచార జాతుల వారికి విముక్తి కల్పించలేదన్నారు. ఆ తర్వాత కాలంలో అనంతశయనం అయ్యంగార్ కమిటీ సిఫార్సు మేరకు 1952 ఆగస్టు 31న క్రిమినల్ ట్రైబ్స్ యాక్టును భారత ప్రభుత్వం రద్దు చేస్తూ ఈ సంచార జాతులకు విముక్తి కల్పించారని అన్నారు. అప్పటినుంచి సంచార్ల విముక్తి దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రాజశేఖర్, జిల్లా అధ్యక్షులు సభ్యులు ఆర్.రెడ్డెయ్య, ఆర్.వెంకటరమణ, చలపతి, శ్రీను, శివ కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.



ఇంటింటి సర్వేలో పాల్గొన్న ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి

ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలి :ఆర్‌డిఒ

ప్రజాశక్తి-వీరబల్లి

ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌డిఒ రామక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు.గురువారం మండలంలోని సానిపాయి గ్రామంలో జరుగుతున్న ఓటు వెరిఫికేషన్ కార్యక్రమంలో ఆర్‌డిఒ పాల్గొన్నారు. ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని విధిగా చేపట్టారు. అందులో భాగంగా ఆర్‌డిఒ సానిపాయి గ్రామం కొత్తపేటలో పాల్గొని ఓటు నమోద ప్రక్రియ ఎలా జరుగుతుందో ఆయన అక్కడున్న టిడిపి బూత్ కన్వీనర్ మాజీ సర్పంచ్ నేతి వెంకటరమణ, బిఎల్‌ఒ జాఫర్‌లను అడిగి తెలుసుకున్నారు.

హిందీభాష పట్ల మక్కువ కలిగేలా బోధన

ప్రజాశక్తి-పుల్లంపేట



హిందీభాష పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న ఎంఇఒలు

మండల పరిధిలోని పివిజి పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎంఇఒలు చక్రధర్‌రాజు, నాగ తిరుమలరావు ఆధ్వర్యంలో హిందీ ఉపాధ్యాయుల సముదాయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ చక్రధర్‌రాజు మాట్లాడుతూ హిందీ ఉపాధ్యాయులు హిందీభాష పట్ల విద్యా ర్థులకు అర్థమయ్యేలా భయాన్ని పోగొట్టి బాషపై మక్కువ కలిగేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థికీ అర్థమయ్యేలా ఒకసారి బదులు రెండుసార్లు అయినా బోధించాలని సూచించారు. డిజిటల్ బోర్డ్ సహాయంతో పాఠానికి సంబంధించినటువంటి చిత్రాలను, కవులను, రచయితలను చూపించి బోధించాలన్నారు. రెండవ ఎంఇఒ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కూడా అర్థమయ్యే విధంగా సాధారణ పద్ధతులలో బోధించి ప్రతి విద్యార్థిని అర్థమైందా లేదా అడిగి అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు తిరుమలరావు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు కృష్ణవేణి, మండల హిందీ ఉపాధ్యాయులు సయ్యద్ సర్తాజ్‌హుస్సేన్ పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్రిజ్ వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని భావికాడపల్లెకు చెందిన నరసింహులు తన తల్లిదండ్రులు నరసింహులు, రాసుబ్బమ్మల జ్ఞాపకార్థం స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలకు తాగునీటి ఫ్రిజ్‌ను వితరణగా అందించారు. విద్యార్థులకు చల్లని తాగునీటిని అందించాలనే ఉద్దేశ్యంతో ఫ్రిజ్‌ను అందించినట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థుల కోరిక మేరకు ఫ్రిడ్జ్‌ను వితరణగా ఇచ్చారని ఎంపిటిసి జయశంకర్ తెలిపారు. పాఠశాలలో ఎటువంటి సమస్యలు తలెత్తిన తమ దృష్టికి తీసుకుని వస్తే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

తంబళ్లపల్లె : గ్రామీణ నిరుపేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి అనసూయమ్మ తెలిపారు. గురువారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు కొట్టాల, ఆర్‌ఎన్ తాండా పంచాయతీలలో పల్లెబాట కార్యక్రమంలో నాయకులు సహదేవ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఎంపిటిసి సభ్యులు రామకృష్ణల ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వ అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు వారికి చేకూరిన లబ్ధి వివరించారు. గ్రామ స్వరాజ్యాన్ని గ్రామాలలో రోడ్లు మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. ప్రజల ముంగిటికే పాలన తీసుకొచ్చారన్నారు. గ్రామాలలో సచివాలయ వ్యవస్థ తో పాటు ఆర్బికే కేంద్రాలు హెల్త్ సెంటర్లో, ఏర్పాటు చేశారన్నారు. కొటాలలో రూ.21లక్షల ఖర్చుతో నిర్మించిన ఆర్‌బికె కేంద్రం, రూ.22 లక్షలతో నిర్మించిన ఆరోగ్య కేంద్ర భవనాలను ఎంపిపి ప్రారంభించారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గ్రామాల అభివృద్ధి కోసం అహర్నిశల్లో కృషి చేస్తున్నారన్నారు. మరో మారు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించి మరింత అభివృద్ధి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, వైసిపి మండల కన్వీనర్ చౌడేశ్వర్, ఎంపిడిఒ సురేంద్రనాథ్, ఎపిఒ అంజనప్ప, ఎపిఎం గంగాధర్,సింగల్ విండో చైర్మన్ భార్గవరెడ్డి, వైస్ ఎంపిపి కరీం, నాయకులు నరేందర్‌రెడ్డి, కోటిరెడ్డిపాల్గొన్నారు.

డాక్టర్ రవిశంకర్‌రెడ్డికి 'గిడుగు' సత్కారం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరుకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆర్.రవిశంకర్ రెడ్డి గిడుగు రామ్మూర్తి సత్కారం అందుకున్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి సాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ప్రారంభమైన తెలుగు భాషా వికాస వారోత్సవాల్లో భాగంగా సన్మానం అందుకున్నట్లు తెలిపారు.ప్రజలకు అందిస్తున్న వైద్య, సామాజిక, ధార్మిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఇప్పటికే ఎన్నో పురస్కారాలు, సన్మాన, సత్కారాలను అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రముఖ సాహితీవేత్త గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తాను పొందిన ఈ సత్కారం తన పట్ల మరింత బాధ్యతను పెంచిందని అన్నారు.

క్రైం కార్నర్

రైలు కిందపడి వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-నందలూరు

ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి వ్యక్తి మృతి చెం దిన సంఘటన నందలూరు రైల్వే స్టేషన్లో గురువారం చోటు చేసు కుంది.లోక్‌మాన్ తిలక్ నుంచి మధురైకి వెళ్ళు మధురై స్పెషల్ రైలు నుంచి సోలాపూర్ నుంచి తిరుమలకు వెళుతున్న మహేష్ మచ్చా(34) అనే ప్రయాణికుడు ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. తీవ్ర గాయాల పాలైన క్షతగాత్రున్ని సీనియర్ మెడికల్ ఆఫీసర్ బచ్చు జయభాస్క రరావు ప్రధమ చికిత్స అందించారు.108 వాహనానికి సమాచారం అందించిన వారు రావడం ఆలస్యం కావడంతో ఆ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ వైద్యశాలకు తరలించారు. మృతుడు మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన సోలాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతునితోపాటు ప్రయాణిస్తున్న వారు రేణిగుంట వరకు వెళ్లి తిరిగి నందలూరుకు చేరుకుని రిమ్స్‌కు చేరుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ప్రజాశక్తి-పీలేరు

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన పీలేరు పట్టణంలోని కోటపల్లి సమీపంలో చోటుచేసుకుంది.ఇన్‌ఛార్జి సురేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కాకులారంపల్లె పంచాయితీ, ఇందిరమ్మ కాలనీకి చెందిన సుధాకర్ (37) గురువారం స్థానిక కోటపల్లి బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న తన కుమార్తె నందినీని ఆటోలో తీసుకొచ్చి వదిలాడని తెలిసింది. ఆ తర్వాత పాఠశాల బయట ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆటో దగ్గరకు వచ్చారని, తమను త్వరగా ఆర్‌టిసి బస్టాండులో వదలాలని సుధాకర్‌ను అడుగుతూ ఒక వ్యక్తి ఆటోలో ఎక్కాడని అన్నారు. ఇంతలో వెనుక నుంచి ఏదో సూది గుచ్చినట్లు అనిపించడంతో బాధితుడు వెనుదిరిగి చూసేసరికే ఆటోలోని వ్యక్తి పారిపోవడంతో సుధాకర్ కొంతసేపటికి సంఘటనా స్థలంలోనే కుప్పకూలిపోయినట్లు తెలిసిందన్నారు. స్థానికులు వెంటనే సుధాకర్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని పేర్కొన్నారు. మృతుడికి భార్య అశ్విని, కుమార్తె నందిని(15), కుమారుడు చేతన్ (12) ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.